
సాక్షి ఒడిశా

బుధవారం ׀ 31 ׀ జూలై ׀ 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,17,347
బంగారం	12 గ్రాముల 850 మిల్లీ గ్రాములు
వెండి	87 గ్రాముల 150 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరి



ఖరీఫ్ లక్ష్యం 1,84,300 హెక్టార్లు

రాయగడ డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్-24 సమీక్ష నిర్వహించారు. 1,84,300 హెక్టార్లలో పంట సాగు లక్ష్యంగా నిర్ణయించారు. - 8లో



కేంద్ర బడ్జెట్‌పై ఆగ్రహం - 8లో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాసేలా ఉందని ఒడిషా ఖేత్ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు మండిపడ్డారు.

న్యూస్‌రీల్

రక్తదానం మహాదానం



రక్తదాన శిబిరంలో పోలీసులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ పరిధి డంగసొరడ పోలీస్ ఔట్‌పోస్టు ప్రాంగణంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసులు స్వచ్ఛందంగా హాజరై 14 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు పోలీసు ఉన్నతాధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



బాలకృష్ణ (ఫైల్)

రాయగడ: రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. జేకేపూర్ సమీపంలోని సింగపూర్ రోడ్డు రైల్వే స్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫారం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు జేకేపూర్‌లోని నెహ్రూనగర్‌కు చెందిన పిల్లగాపు బాలకృష్ణ(33)గా రైల్వే పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విరిగిపడుతున్న కొండచరియలు



కొండ పైనుంచి జారిపడిన రాళ్లు

జయపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 26వ నంబర్ జాతీయ రహదారిలోని జయపురం– కొరాపుట్ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ జాతీయ రహదారుల విభాగం అధికారులు ఎటువంటి రక్షణా చర్యలు గానీ, ప్రమాద సూచిక బోర్డులు గానీ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.


వంతెన నిర్మాణం పూర్తి చేయాలని వినతి



కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామపెద్దలు


పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ కోరడాసింగి వద్ద మహేంద్రతనయ నదిపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తిచేయాలని కుజాసింగి, కోరడాసింగి పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోరడాసింగి మాజీ సర్పంచ్ ముర్షితా మండళ్ మాట్లాడుతూ 2013లో పనులు ప్రారంభించి రెండు పిల్లర్లు వేసి అసంపూర్తిగా నిలిపివేశారని చెప్పారు. వంతెన పూర్తయితే 20బుర్జి, ఎస్.కోరడాసింగి, కోలమాసింగి, మురుమురియా, తుడుములు, గంగపూర్, మురిసింగి, మండళసాయి, గిరా, బలముండా, అడై, కార్జిసాహి, అంగడా, లోండైసాయి, నువాగాం, కుండెయిసింగి, నువాసాహి తదితర 20 గిరిజన గ్రామాల ప్రజలకు విద్య, వైద్యం, రేషన్ సరుకులు వంటి సేవలు సులభతరమవుతాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీర్లతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

బంగాళదుంపల గోదాములపై దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సోమవారం సాయంత్రం పౌరసరఫరాల శాఖ అధికారులు బంగాళదుంపల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. కృత్రిమ కొరత చూపించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో గుణుపూర్ సబ్ డివిజన్ పౌరసరఫరాల శాఖ అధికారి దేవేంద్ర మహాపాత్రొ, సమితి మార్కెటింగ్ విభాగం అధికారి రీతా బెహెరాలు పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు ప్రాంతం

పోలవరం ప్రాజెక్టుపై మరోసారి రగడ

- కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రాకు కేటాయింపులతో ఒడిశాలో నిరసనలు
- హౌస్ కమిటీ ఏర్పాటుకు కాంగ్రెస్ డిమాండ్
- రాజ్యసభలో బీజేడీ నాయకుల ఆందోళన
- రోజుకో వివాదంతో ప్రాజెక్టు ప్రశ్నార్థకం
- న్యాయస్థానాల్లో కొలిక్కిరాని విచారణ
- స్పష్టత ఇవ్వని బీజేపీ ప్రభుత్వం

అభయం.. ఆగ్రహం!

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: సీఎం



విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

ఒడిశాతో ముడిపడి ఉన్న అంతర్ రాష్ట్ర వివాదానికి సంబంధించిన నీటిపారుదల ప్రాజెక్టులను ఈ నెల 15న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సమీక్షించారు. మహానది, వంశధార, పోలవరం తదితర అంతర్ రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఒడిశా ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఒడిశా ప్రజల జీవనోపాధిని ప్రభావితం చేసే, ఒడిశా పర్యావరణానికి హాని కలిగించే, ఒడిశాకు వ్యతిరేకమైన అన్ని ప్రాజెక్టులను పూర్తిగా వ్యతిరేకించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

భువనేశ్వర్: ఒడిశా, ఆంధ్రప్రదేశ్ అంతర్ రాష్ట్ర పోలవరం ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశమైంది. ఇరు రాష్ట్రాలు చట్టపరమైన అడ్డంకులను అధిగమించకుండా రాజకీయ కారణాలతో ప్రాజెక్టుపై ఆధిపత్యం ప్రదర్శించడంతో నిర్మాణంపై స్పష్టత కరువవుతోంది. అంతర్రాష్ట్ర ప్రాజెక్టు నిర్మిస్తున్నప్పుడు ఇరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య బలమైన సమన్వయం, వివాదరహిత సంప్రదింపులు అవసరమైనా ఆ దిశగా ప్రయత్నాలు లేకపోవడంతో నిత్యం ఏదో ఒక వివాదంతో పురోగతి కుంటుపడుతోంది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు భారీగా కేటాయింపులు జరగడంతో మరోసారి వివాదాస్పద పరిస్థితులు తలెత్తాయి.

కేంద్రం అభయం

ఈ సమావేశమైన వారం తర్వాత ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తామని చెప్పింది. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా ఆదుకుంటామని అభయం ఇచ్చింది.

కాంగ్రెస్ వ్యతిరేకత

కేంద్రం నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసనసభలో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును మూల్యాంకనం చేసేందుకు సభా కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో ఏ ఒక్కరూ నిర్వాసితులు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు స్పీకర్ రూలింగ్ జారీ చేయాలని పట్టుబడుతున్నారు.

రాజ్యసభలో రచ్చ

బిజూ జనతా దళ్ ఎంపీలు రాజ్యసభలో ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మినహా ఇతర మంత్రి మండలి సభ్యులు గానీ, అధికార పక్షం ఎమ్మెల్యేలు గానీ మాట్లాడకపోవడం చర్చకు తావిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు మద్దతు ఇస్తుందని, ఫలితంగా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నష్టం తప్పదనే వాదనలు ఊపందుకుంటున్నాయి. అయితే కేంద్ర నాయకత్వానికి భయపడి అందరూ మౌనంగా ఉన్నారు.

ఆంధ్రాలో ఆమోదం

పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులను కేంద్రం మంజూరు చేస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే భాగస్వామి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతు మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పోలవరం ఆనకట్ట ఎత్తును 45.72 మీటర్లకు పెంచాలని కూడా నిర్ణయించింది.

ఎత్తు పెంచడంతో వివాదం

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు జాతీయ గుర్తింపు సాధించింది. అప్పట్లో 41.15 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పుడు పరిమితి ఎత్తుని పెంచాలని నిర్ణయించడం వివాదాస్పదమైంది. ఫలితంగా ప్రాజెక్టు పురోగతి కుంటుపడింది. గతంలో రూ. 400 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ (రిటైనింగ్ వాల్) స్థానంలో మరింత శక్తివంతమైన రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. దీని వ్యయ ప్రణాళిక రూ. 2 వేల కోట్లు. ఈ నిధుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కారు చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. అందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారు.



శంఖభవన్‌లో మాట్లాడుతున్న బీజేడీ అధికార ప్రతినిధి ప్రదీప్ మాఝి

గ్రామాలకు ముంపు ముప్పు

పోలవరం ఆనకట్ట ఎత్తు పెంపు వల్ల సమీప ప్రాంతంలోని 1200 నుంచి 1300 గ్రామాలు నీటమునుగుపోతాయని కాంగ్రెస్ శాసనసభ నాయకుడు రామచంద్ర కదమ్ సభలో ప్రస్తావించారు. ఈ చర్యతో ప్రజలు నిరాశ్రయులవుతారని, విలువైన భూములు నీట మునిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఒడిశాకు ఏమీ చేయలేదని, ఈ సమయంలో ప్రజల్ని నిరాశ్రయులను చేసేలా కేటాయింపులు చేయడం తగదని మండిపడ్డారు.

ఆదివాసీలకు నష్టం

ఈ ప్రాజెక్టు వల్ల ఒడిశాలోని 5,919 మంది గిరిజనులతో సహా మొత్తం 6,818 మంది ప్రజలు ప్రభావితమవుతారని బీజేడీ ఎంపీ డాక్టర్ సస్మిత్ పాత్రో రాజ్యసభలో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల గోడు పట్టదా?

పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో తీవ్రంగా నష్టపోయేది దళిత, గిరిజన ఆదివాసీలు మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు నిరంతరం నిరసన ప్రదర్శించి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల మధ్య కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒడిశా ప్రజల బాగోగుల్ని నీటిలో కలిపి పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచి పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తామని అభయం ఇవ్వడం దురదృష్టకరం. రాష్ట్రంలో ముఖ్యమంత్రి గిరిజనుడైనా గిరిజనుల ప్రయోజనాలపై ఆలోచించడం లేదని బిజూ జనతా దళ్ అధికార ప్రతినిధి ప్రదీప్ మాఝి విలేకరుల సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. 2026 సంవత్సరం నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సి.ఆర్. పటేల్ ప్రకటించడం పట్ల ప్రదీప్ మాఝి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రాజకీయంగా ప్రశ్నార్థకమే..

ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒడిశాలో పూర్తి స్థాయి బీజేపీ ప్రభుత్వం తొలిసారిగా పగ్గాలు చేపట్టింది. ఈ తరుణంలో ఒడిశా ప్రజల గోడుని విస్మరించి ఆంధ్ర ప్రదేశ్‌కు ఏకపక్షంగా సహాయం అందజేస్తాం అనడంలో ఆంతర్యం ఏంటో వేచి చూడాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరురాష్ట్రాల సీఎంల సమావేశం..

పోలవరం అంశంపై చర్చల కోసం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పావులు కదుపుతున్నారు. ఇటీవల నీతీ ఆయోగ్ సమావేశం పరస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలవరం సమస్యపై అధికారుల స్థాయి, ముఖ్యమంత్రి స్థాయి చర్చలు జరపాలని మాఝి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన పట్ల ఆంధ్రప్రదేశ్ సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ విషయం వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు వివాదం పరిష్కారానికి ఇరు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కానున్నట్లు ప్రకటించారు. చట్టపరమైన పరిష్కారం కోసం కోర్టులో విచారణ కొనసాగుతుందని, ఇటువంటి చర్చలు, సంప్రదింపులతో ఈ వివాదం పరిష్కృతం అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర వ్యతిరేక ప్రాజెక్టు..

పోలవరం ప్రాజెక్టు ఒడిశాకు వ్యతిరేకమని, దానిని వ్యతిరేకించాలని కాంగ్రెస్ సభ్యురాలు సోఫియా ఫిర్దోస్ పిలుపునిచ్చారు. 2021లో బీజేపీ ప్రభుత్వమే ఈ ప్రాజెక్టును వ్యతిరేకించినట్లు ఆమె గుర్తు చేశారు. ఇప్పుడెందుకు నిర్ణయం మార్చుకున్నట్లు నిలదీశారు. బీజేపీ వ్యతిరేకించకపోతే ఒడిశా ప్రజలకు అన్యాయం చేసినట్టే అవుతుందన్నారు. ఒడిశా ప్రయోజనాలను విస్మరిస్తే ప్రజలు తప్పకుండా సమాధానం చెబుతారని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును ఆపడంతోపాటు ఒడిశా ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ఆంధ్రప్రదేశ్, ఒడిశా ముఖ్యమంత్రి కలిసి చర్చించుకోవాలని ప్రతిపాదించారు. ఈ మేరకు శాసనసభ హౌస్ కమిటీ ఏర్పాటుకు స్పీకర్ రూలింగ్ ఇవ్వకుంటే కాంగ్రెస్ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యను హత్య చేసి పరారైన భర్త



గౌరి పలక, గౌరిశ్రీ దంపతులు (ఫైల్)



గౌరిశ్రీ మృతదేహం

రాయగడ: మద్యం మత్తులో భార్యపై భర్త ఇనుపరాడ్డుతో దాడి చేసి హత్య చేసి పరారైన ఘటన బుదరావలసలోని కళాశాల రోడ్డులోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గౌరిపలక, గౌరీశ్రీ (45)లు భార్యాభర్తలు. సైకిల్ రిపేర్ చేసుకుని జీవనోపాధిని పొందుతున్న గౌరిపలకకు ముగ్గురు కుమార్తెలు. ఒకరికి వివాహం కాగా మరొకరు ఇంటి వద్దే ఉంటున్నారు. తాగుడుకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం రాత్రి తప్పతాగి ఇంటికి వచ్చిన గౌరిపలక భార్యతో గొడవపడ్డాడు. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడై ఇనుప రాడ్డు సహాయంతో భార్య తలను తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే వేరే గదిలో నిద్రిస్తున్న ఇద్దరు కుమార్తెల వద్దకు వెళ్లిత అమ్మను హత్య చేశానని చెప్పి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న గౌరిశ్రీని చూసి ఇరుగుపొరుగు వారి సాయంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు



గూడ్స్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే సంబల్‌పూర్ రైల్వే మండలం సర్లా యార్డ్ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఖాళీ గూడ్స్ రైలు వ్యాగన్ ట్రాలీ పట్టాలు తప్పింది. మధ్యాహ్నం 2.26 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. నిర్వహణ కార్యకలాపాలు కొనసాగుతుండగా వ్యాగన్ పట్టాలు తప్పినట్లు తూర్పు కోస్తా రైల్వే తెలిపింది. ఆ సమయంలో రైలు నెమ్మదిగా కదులుతుండటంతో ప్రమాద స్థాయి తగ్గిందని, ఈ ఘటనతో రైళ్ల రాకపోకలపై ఎలాంటి ప్రభావం పడలేదని పేర్కొంది. ఇటీవల కాలంలో తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఆలయ భద్రతకు ప్రాధాన్యం

- శ్రీమందిరం రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్



జస్టిస్ విశ్వనాథ్ రథ్

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దేవస్థానం శతాబ్దాల చరిత్రతో కూడిన అత్యంత ప్రాచీన కట్టడమని, దీని పరిరక్షణ అత్యంత కీలకమని శ్రీమందిరం రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు జస్టిస్ విశ్వనాథ్ రథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రత్న భాండాగారంలో రెండు గదులు తెరిచి ఆభరణాలను గ్ రూమ్‌లకు తరలించిన నేపథ్యంలో మందిర మౌలిక నిర్మాణానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. బీరువాలు, చెక్క పెట్టెలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్త అంశాల పట్ల మార్గదర్శకాల్ని ప్రతిపాదించారని, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంతో తదుపరి కార్యాచరణ ఊపందుకుంటుందన్నారు. అయితే ఏమాత్రం తొందరపాటు లేకుండా అన్ని పనుల్ని సక్రమంగా పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రత్న భాండాగారం నిర్వహణ కార్యకలాపాలు పురస్కరించుకుని స్వామివారి దైనందిన సేవలు, భక్తుల దర్శనానికి ఏమాత్రం అంతరాయం లేకుండా జాగ్రత్త వహిస్తున్నామన్నారు. భారత పురావస్తు పరిశీలనలో కొత్త అంశం వెలుగులోకి వస్తే తదనుగుణంగా ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్‌ఓపీ) ప్రతిపాదిస్తామని చెప్పారు. అవసరమైన పరిస్థితుల్లో ఆయా వర్గాలతో సంప్రదించి ఏఎస్‌ఐ అత్యంత సున్నితంగా ఈ పనుల్ని నిర్వహిస్తుందని జస్టిస్ విశ్వనాథ్ రథ్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఎటువంటి అపోహల్ని ప్రేరేపించవద్దని మీడియాను అభ్యర్థించారు.

క్లుప్తంగా

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: స్థానిక పూల్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 1 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాల కోసం అంధబాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, 40 శాతం అంధత్వం గల బాలబాలికలు పాఠశాలలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. సదరం వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రవేశం పొందిన వారికి ప్రభుత్వం ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ శిక్షణ ఇస్తుందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర, తల్లికి వందనం, మనబడి మన భవిష్యత్తు తదితర ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. పాఠశాలలో మొత్తం 31 ఖాళీలు ఉన్నాయని, పూర్తి వివరాల కోసం సెల్: 83175 48039, 79895 92141 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ ఎంపికలో పీడీలు బంగారు నాయుడు, వెంకటనాయుడు, సత్యనారాయణల ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరగ్గా ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెల 17,18,19 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్రావు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



రైలు నుంచి జారిపడిన రాంప్రసాద్

పార్వతీపురం టౌన్: ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. పార్వతీపురం రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై జీఆర్‌పీ అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని రెడ్డివీధికి చెంది కాసిన రాంప్రసాద్ ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నాడు. ప్రెస్‌కు సంబంధించి పేపర్లు అవసరమై రాజమండ్రి వెళ్లేందుకు పార్వతీపురం స్టేషన్‌లో భవానిపట్నం ట్రైన్ ఎక్కి ప్రమాదశాత్తు జారిపడ్డాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా చికిత్సకోసం విశాఖలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

● ముగ్గురికి గాయాలు



రోడ్డుపై ఉన్న క్షతగాత్రులు

సీతానగరం: రాష్ట్రీయ రహదారిపై సీతానగరం మండలంలోని అంటిపేట–లచ్చయ్యపేట గ్రామాల మధ్య మంగళవారం మధ్యాహ్నం అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన డ్రైవర్ సీహెచ్ చిన్నారావు ఆటోలో అదే గ్రామానికి చెందిన ఆర్.దావీదు, సీహెచ్ శంకరరావు, అరసాడ పైడిరాజు, సీహెచ్ ప్రసాద్ అంటిపేట నుంచి లచ్చయ్యపేట వెళ్లేందుకు ఎక్కారు. అంటిపేట సమీపంలో బియ్యం గొడౌన్ ఎదురుగా రోడ్డుపై ఆటో అదుపు తప్పి బోల్తాపడి పొలాల్లో పడిపోవడంతో జరిగిన ప్రమాదంలో అందరూ గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు సమీపంలో ఉన్న బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. క్షతగాత్రుల్లో పైడిరాజు(23) పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కబేళా కేసులో ముగ్గురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: కొత్తపేట వద్ద నిర్వహిస్తున్న కబేళాకు సంబంధించిన కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు టూటౌన్ సీఐ కోరాడ రామారావు మంగళవారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో కబేళా నిర్వహిస్తున్న మహమ్మద్ ఫయాజ్, అలీమ్, మహమ్మద్ యూసఫ్‌లు ఉన్నట్లు చెప్పారు.

ఖరీఫ్ లక్ష్యం 1,84,300 హెక్టార్లు

● సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి
● సమీక్ష సమావేశంలో కలెక్టర్ మహాజన్



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్. పక్కనే జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుమన్ సింగ్ పట్నాయక్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ : సాగునీటి వనరులను సద్వినియోగ పరుచుకుంటే ఖరీఫ్ లక్ష్యాన్ని అధిగమించగలమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్–24 సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలన్నారు. రైతులను ప్రోత్సహించినప్పుడే ఎదుగుదల ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. వరి రైతులకు గిట్టుబాటు ధర పెంచడంతో రైతులు ఆసక్తి కనబరుస్తారని, ఈ సమయంలో వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. జామ , స్ట్రాబెర్రీ, పనస, అరటి వంటి పంటలపై రైతులు అవగాహన కల్పించాలన్నారు. డొంగిరియాలు నివసిస్తున్న నియమగిరి పర్వత ప్రాంతాల్లో తొలిసారిగా పండించిన స్ట్రాబెర్రీ పంట సత్ఫలితాలు ఇచ్చిందని, సాగు విస్తీర్ణం పెరిగేలా మరింత ప్రోత్సహించాలన్నారు. ఇక్కడి పనస, మామిడి, వేరుపనస పంటలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి కావడం సంతోషకరమన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగేలా తరచూ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

మేలు రకం విత్తనాల పంపిణీ..

తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు సాధించేలా మేలురకం విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అన్నారు. కొందరు అవగాహన లోపంతో నాసిరకమైన విత్తనాలు వేసి పంటలు పండక నష్టపోతున్నారని, వాటిపై దృష్టి సారించాలన్నారు. అధికారులు తరచూ దుకాణాలపై దాడులు నకిలీలను అరికట్టాలని, నిబంధనలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై రైతుల్లో అవగాహన కలిగించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రైతు రుణాల మంజూరులో జాప్యం జరగకూడదన్నారు.

సాగునీటి వనరులు పుష్కలం..

ఈ ఏడాది 1,84,300 హెక్టార్లలో వివిధ పంటలు వేసేందుకు ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుమన్ సింగ్ పట్నాయక్ అన్నారు. జిల్లాలో 1,93,504 హెక్టార్ల సాగు భూమి ఉందన్నారు. ఇందులో భాగంగా 77,344 హెక్టార్లలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, మిగతా 16,160 హెక్టార్ల విస్తీర్ణం వర్షాధార భూములని పేర్కొన్నారు. 40 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట, మిల్లెట్స్ మిషన్ పథకంలో మరో 12,630 హెక్టార్లలో తృణధాన్యాలు సాగు చేసేందుకు సన్నహాలు చేస్తున్నామని వివరించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 31,700 క్వింటాళ్ల ఎరువులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఒక్క పద్మపూర్ సమితిని మినహాయిస్తే మిగత 10 సమితుల్లో రాగుల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో 11 సమితుల వ్యవసాయ అధికారులు, వాటర్‌షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ దయానిధి బాగ్, ఎనలిస్ట్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాసేలా కేంద్ర బడ్జెట్



కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న ఒడిషా ఖేత్ మజ్దూర్ సంఘ్ నాయకులు

పర్లాకిమిడి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఎన్డీఏ విపక్షాలకు అనుకూలంగా..కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాసేలా ఉందని ఒడిషా ఖేత్ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీ సభ్యులు, సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి రైయితో ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం దండుమాలవీధి సీపీఎం కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులకు 200 రోజుల పనిదినాలు, రూ.600 దినసరి కూలీ అందించాలని, జాబ్ కార్డులు పునరుద్ధరించాలని, కార్మికులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి పది కిలోల బియ్యం, గోధుమలు, పప్పు, కిరోసిన్ అందజేయాలని డిమాండ్ చేశారు. దళిత ఆదివాసీ విద్యార్థులు చదువుకునేందుకు భృతి అందజేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ జగన్నాథ పాఢికి అందజేశారు. కార్యక్రమంలో సి.పి.ఎం.(ఎల్) నేత శ్రీనివాస బెహెరా, కృషక్ నేత ఎం.బంగారి, సునాం మండళ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

రాయగడ: స్థానిక న్యూకాలనీలోని సాయిరాం రెస్టారెంట్‌లో ఈ నెల 22న అర్ధరాత్రి జరిగిన చోరీ కేసుకు సంబంధించి పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో టికిరపడ గ్రామానికి చెందిన రూపేష్ నాగ్, పిండాపదర్ గ్రామానికి చెందిన పంకజ్ కొండగిరి, పింకు టకరిలతో పాటు మరో నలుగురు మైనర్లు ఉన్నారు.

ఈ మేరకు మంగళవారం రాత్రి సదరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీఓ రశ్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కెకెబీకే కుహరొలు వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల నగదు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. రెస్టారెంట్ యజమాని ఎం.శ్రీనివాస్ రావు ఎప్పటిలాగే ఈ నెల 22వ తేదీ రాత్రి 11 గంటలకు రెస్టారెంట్‌ను మూసివేసి ఇంటికి వెళ్లారు. అనంతరం దొంగలు ప్రవేశించి ఎగ్జాస్టర్ ఫ్యాన్‌ను విరగ్గొట్టి సొరుగులోని రూ.3.40 లక్షలు దొంగిలించారు. యజమాని ఉదయం వచ్చే చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారు.

విపక్షాల వాయిదా తీర్మానం తిరస్కరణ



సురమా పాఢి, స్పీకర్

భువనేశ్వర్ : రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు వ్యతిరేకంగా విపక్షాలు ప్రతిపాదించిన వాయిదా తీర్మానం స్వీకరణకు స్పీకరు సురమా పాఢి తిరస్కరించారు. తప్పుడు ఆధారాలతో తీర్మానం ప్రతిపాదించడం పట్ల అధికార పక్ష సభ్యుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో విపక్ష బీజేడీపై మండిపడ్డారు. ఇటీవల కాలంలో ఎలాంటి ధరలు పెంచలేదని మంత్రి స్పష్టం చేశారు. ఆవ నూనె మినహా ఇతర నిత్యావసర పదార్థాల ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పెసర పప్పు కిలో ధర రూ.105, పామోలిన్ లీటరు ధర రూ.110, ఉల్లి కిలో ధర రూ. 40, బంగాళదుంపలు కిలో ధర రూ.30కు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆవ నూనె మాత్రం లీటరు ధర రూ.154 నుంచి రూ. 158కి చేరిందన్నారు. బీజేడీ హయాంలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్లే నిత్యావసర ధరలు ఈ స్థాయికి చేరాయని ఆరోపించారు. రైతులను ప్రోత్సహించలేదని, ఆలుగడ్డ మిషన్ బెడిసి కొట్టించిందని చెప్పారు. రూ. 270 కోట్ల వినియోగంతో తలపెట్టిన ఉల్లి మిషన్ విఫలమైందన్నారు. 20 నుంచి 30 కోల్డ్ స్టోరేజీలు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేయగా అందులో సగం మూతపడ్డాయన్నారు.

వీలునామా పరిగణనలోకి తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద న్యాయవాదులు

రాయగడ: ఎవరైనా ఒక వ్యక్తి అంతిమ దశలో స్వచ్ఛందంగా రాసి ఇచ్చిన వీలునామా ఆ వ్యక్తి చివరి కోరికతో సమానమని, దానిని అనుసరించి మృతి చెందిన కుటుంబానికి భూమి హక్కు పట్టా లభిస్తుందని హైకోర్టు తీర్పు ఇచ్చినా తహసీల్దార్ కార్యాలయంలో గుర్తించడం లేదని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభదాస్ (టుటు) ఆధ్వర్యంలో న్యాయవాదులు కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో వీలునామా ఆధారంగా మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి భూమి హక్కు పట్టా లభించేదని, అయితే ఐదేళ్లగా తహసీల్దార్ కార్యాలయంలో భూమి హక్కుపట్టాలు మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆకట్టుకున్న విజ్ఞానమేళా



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సరస్వతీ శిశుమందిర ప్రాంగణంలో మంగళవారం జ్ఞాన, విజ్ఞాన మేళా 2024–25 ప్రదర్శన ఏర్పాటు చేశారు. 172 మంది విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత కుమార్ దాస్, గౌతమకుమార్ పాత్రో, శిశుమందిర ప్రధాన ఆచార్యులు మమతా మహాపాత్రో, తనూజ మహంతి, వినీత గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబూరావు మహంతికి గ్లోబల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న బాబూరావు

రాయగడ: ప్రముఖ రచయిత, సమాజ సేవకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బాబూరావు మహంతికి గ్లోబల్ అచీవర్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. గోవాలో ఆదిలీల ఫౌండేషన్ నిర్వహించిన నేషనల్ ఇండియా సమ్మిట్‌లో సెంట్రల్ యూనివర్సిటీ చాన్సలర్, అరుణాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ సురేష్‌బాబు, వైస్ ఛాన్సలర్ ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొని బాబూరావును సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రమీలా మృతి



నివాళులు అర్పిస్తున్న భర్త డాక్టర్ శ్రీధర్



ప్రమీలా పట్నాయక్

కొరాపుట్: నబరంగ్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రమీలా పట్నాయక్ (77) తుదిశ్వాస విడిచారు. మంగళవారం వేకువజామున పట్టణంలోని జగన్నాథ మందిరం రోడ్డులోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆ సమయంలో పక్కనే భర్త డాక్టర్ శ్రీధర్‌రావు ఉన్నారు. 1998లో కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రమీలా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ప్రస్తుతం నబరంగ్‌పూర్ తెలుగు శిష్ట కరణ సంఘం గౌరవ అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. మృతి విషయం తెలుసుకున్న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ కునునాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాదంబని త్రిపాఠి, డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, కౌన్సిలర్లు, శిష్ట కరణ సంఘం సభ్యులు ఆమె నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు.

బీజేపీ నేతలకు బెయిల్

జయపురం: సంబల్‌పూర్‌లో గత హనుమాన్ జయంతి వేడుకల సమయంలో కొంత మంది చేసిన దాడికి నిరసనగా గత ఏప్రిల్ 19న జాతీయ రహదారిపై బీజేపీ నేతలు రాస్తారోకో నిర్వహించారు.

అప్పట్లో 17 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు కచేశారు. వీరికి మంగళవారం బెయిల్ మంజూరైంది.

బీఎస్ఎఫ్ జవాన్లకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న జవాన్లు

మల్కన్‌గిరి: పోడియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని 142 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లకు మంగళవారం కొత్త శిక్షాస్మృతి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిబిరాన్ని అసిస్టెంట్ కమాండర్ సిజు గార్గె హజార్ ప్రారంభించారు. ఇండియన్ సివిల్ కోడ్, ఇండియన్ సివిల్ జస్టిస్ కోడ్, సివిల్ ఎవిడెన్స్ కోడ్‌లపై చర్చించారు. కార్యక్రమంలో పోడియా ఐఐసీ నిరోద్‌కుమార్ బాగ్, ఏఎస్ఐ చిత్రంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక విక్రమదేవ్ ఆర్ట్స్, క్రాఫ్ట్ కళాశాల ప్రహరీని ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు, ఆక్రమణలను మంగళవారం జయపురం మున్సిపల్ అధికారులు తొలగించారు. మూడు రోజులు గడువు ఇచ్చినా స్పందించకపోవడంతో జేసీబీతో కూల్చివేసినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ చెప్పారు. పట్టణంలో ఎక్కడ ఆక్రమణలు వెలిసినా తొలగించక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ భవానీ హల్దా, సత్యనారాయణ పాత్రో, పి.జగదీష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


వేడి నీరు పడి బాలికకు గాయాలు



గాయపడిన అంజన మాలి

జయపురం : బొయిపరిగుడ సమితి జి.మఝిగుడ పంచాయతీ మహుశిపుట్‌లో వేడినీరు పడి బాలిక గాయపడింది. గ్రామానికి చెందిన చిత్రసేన మాలి కుమార్తె అంజన మాలి మంగళవారం ఆడుకుంటుండగా బంతి వంటగదిలోకి వెళ్లింది. లోపలికి వెళ్లి బంతి తీసుకుంటున్న సమయంలో జారిపడి పొయ్యిపై మరుగుతున్న నీటిపై పడింది. దీంతో బాలిక శరీరం కాలిపోయింది. వెంటనే చిన్నారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎర్నాకులంలో వలస కార్మికుడి మృతి



ప్రదీప్ కుమార్ జెన్నా మృతదేహం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి తరంగడ పంచాయతీ అంద్రాసింగి గ్రామానికి చెందిన ప్రవాస వలస కార్మికుడు విక్రంజెన్నా కుమారుడు ప్రదీప్ కుమార్ జెన్నా కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో పనిచేస్తూ విధి నిర్వహణలో మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిని సంప్రదించారు. దీంతో ఎమ్మెల్యే కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌తో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి సాయంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

డీహెచ్‌హెచ్‌లో సి.టి.స్కాన్ సేవలు ప్రారంభం



సి.టి.స్కాన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మహాజన్



సి.టి. స్కాన్ యంత్రం

రాయగడ: సామాన్యులకు మరిన్ని వైద్య సౌకర్యాలను కల్పించేందుకు జిల్లా వైద్యశాఖ మరో అడుగు ముందుకేసింది. ఇందులో భాగంగా జిల్లా హెడ్ క్వార్టర్ హాస్పిటల్‌లో సి.టి.స్కాన్ సేవలకు శ్రీకారం చుట్టింది. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోఅత్యధిక శాతం మంది ఆదివాసీ, హరిజనుల, బడుగు వర్గాలకు చెందిన వారు ఉన్న నేపథ్యంలో, మెరుగైన చికిత్స అందించేందు సి.టి. స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్‌రౌత్రాయ్ మాట్లాడుతూ అత్యవసర టెస్టులకు సంబంధించి రోగులకు రెండు గంటల్లోపు, సాధారణమైన టెస్టులకు ఆరు గంటల్లోపు రిపోర్టులు అందజేస్తామన్నారు. సి.టి.స్కాన్ నిర్వాహకుడు, డయాగ్నస్టిక్ కేంద్రం రాష్ట్ర ప్రముఖుడు సత్యసుందర్ భాష మాట్లాడుతూ పీపీపీ విధానంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే 16 చోట్ల సి.టి. స్కాన్ సేవలు ప్రారంభించామన్నారు. త్వరలో మరో ఆరు జిల్లాల్లో సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం రాజేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహానది మహోగ్రరూపం



ముండలి బ్యారేజ వద్ద ఉప్పొంగుతున్న మహానది

భువనేశ్వర్: మహానది ఉగ్రరూపం దాల్చుతోంది. హిరాకుద్ జలాశయం వరద నీరు విడుదల కావడంతో దిగువ ప్రాంతాల జలాశయాల్లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. మంగళవారం నాటికి 5 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తోంది. ఖైరమల్ ద్వారా 4 లక్షల 72 వేల క్యూసెక్కుల నీరు, బొరొమూల్ ద్వారా 4 లక్షల 84 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఉదయం 6 గంటల నాటికి ముండలి బ్యారేజీ వద్ద నీటిమట్టం గణనీయంగా పెరిగి 1.7 లక్షల క్యూసెక్కులకు తాకిందని అధికారులు తెలిపారు.

ఆదివారం మూడు దశల్లో 20 గేట్లను తెరిచి హిరాకుద్ జలాశయంలో నిండిన వరద నీటిని విడుదల చేయడంతో ఖైరమల్, బారాముల్ మీదుగా వరద నీరు దిగువ ప్రాంతపు ముండలి బ్యారేజీకి చేరింది. ఇక్కడ నుంచి అంచెలంచెలుగా దిగువ ప్రాంతాలకు నీరు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్త వహించాలని రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) అధికారి సంబల్‌పూర్, సువర్ణపూర్, బౌధ్, నయాగడ్, అంగుల్, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, పూరీలతో సహా తొమ్మిది జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం

● జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులకు పరిహారం అందించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె. కేశవనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసులలో మరణించిన వారి కుటుంబీకులకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. తరువాత వాహనం గుర్తించినట్లయితే ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ చేసుకోవచ్చునని, చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసులలో కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిమ్ చేసేందుకు బాధితులు ముందుకురావడం లేదన్నారు. న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అవగాహన కల్పించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించిందని తెలిపారు. జిల్లాలో నమోదైన 13 హిట్ అండ్ రన్ కేసులలో బాధితులను ఆగస్టు 2 తేదీన సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌కు తీసుకురావాలని, వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా హిట్ అండ్ రన్ కేసుల బాధితులుంటే శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి రావాలని లేదా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణారావు, పి. సత్యనారాయణ, ఎస్సై కేపీ మూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనిమెట్టలో బహిరంగ ప్రదేశంలో మందులు


చెత్తకుప్పలో పారబోసిన మందులు

పొందూరు: మండలంలోని కనిమెట్ట గ్రామంలో మంగళవారం బహిరంగ ప్రదేశాల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే మందులు దర్శనమిచ్చాయి. కాలం తీరిన మందులైనా సరే జాగ్రత్తగా డిస్పోజ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇలా చెత్త కుప్పలు, పాడుపడిన బావుల్లో మందులు వేస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటి విద్యార్థి కోసం..


విద్యార్థికి నగదును అందిస్తున్న డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

జి.సిగడాం: తోటి విద్యార్థి కష్టంలో ఉన్నాడని తెలుసుకుని విద్యార్థులంతా చేయి చేయి కలిపారు. ఆ విద్యార్థి వైద్యం కోసం రూ.90వేలు సేకరించారు. వీరికి ఉపాధ్యాయులు కూడా జత కలిసి మరో రూ.60వేలు అందించారు. మండలంలోని డీఆర్‌వలస జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాకర్లపూడి వెంకట లఖిత్ రామరాజు గుండె, చెవి వ్యాధితో బాధ పడుతున్నాడని, వైద్యం కోసం సుమారుగా రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.1.50 లక్షలు పోగేసి మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. శ్రీకాకుళం డివిజల్ ఉప విద్యా అధికారి ఆర్.విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కూర్మినాయుడు చేతులమీదుగా ఈ సాయం అందించారు. ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి అదనంగా రూ.5 వేలు అందించారు.

చిన్నారావు చూపు సజీవం


నేత్రదాత చిన్నారావు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగ బావాజీ తోటలో నివాసం ఉంటున్న చింతనిప్పుల చిన్నారావు (72) అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు సీహెచ్ సావిత్రి, వేంకటేష్, గిరీష్, అరుణ, మోహనరావు, భారతి, డాక్టర్ పి.సుందరయ్యలు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు బి.జగదీష్ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

చేపల మృత్యువాతతో ఆందోళన


చెరువులో తేలుతున్న చనిపోయిన చేపలు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి దుంపల చెరువులో గత కొద్ది రోజులుగా చేపలు మృత్యువాత చెందుతుండటంతో చేపల పెంపకందారులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఒక్క రోజే అధిక సంఖ్యలో చేపలు చనిపోయి నీటిపై తేలిపోయాయి. ఈ చెరువులోనే వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండటంతో చెరువు కలుషితం కావడం వల్లనే చేపలు చనిపోయి ఉంటాయని స్థానికులంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చేపల పెంపకదారులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధితో కానిస్టేబుల్ మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.మాధవరావు అనే కానిస్టేబుల్ కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ విజయవాడ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందినట్లు రైటర్ సింహాచలం తెలిపారు. మాధవరావు సొంత గ్రామం జలుమూరు మండలం కొత్తకోట కాగా.. నగరంలోని దమ్మలవీధిలో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా వ్యాధితో బాధ పడుతున్న మాధవరావు మార్చి 1 నుంచి సెలవులో ఉన్నారని, ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారని తెలిపారు. మాధవరావు మృతిపై సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణ, స్టేషన్ సిబ్బంది సానుభూతి వ్యక్తం చేశారు.

ఏడుగురు గంజాయి నిందితుల అరెస్ట్

- 10.825 కిలోల గంజాయి స్వాధీనం
- ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్‌లు సీజ్


భామిని: పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న, వినియోగిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారికి సహకరిస్తున్న ఒక జువైనల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రాజాం పట్టణంలో ముగ్గురు వ్యక్తులు గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌లో కొనుగోలు చేసి, రాజాం నుంచి చిలకపాలెం వైపు అక్రమంగా రవాణా చేస్తూ అంతకాపల్లి గ్రామ జంక్షన్ వద్ద రాజాం పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన ముగ్గురిలో గంజాయిని కొరాపుట్ నుంచి రాజాం వరకు బైక్‌పై తీసుకుని వచ్చిన కొరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ ములిగూడ గ్రామానికి చెందిన సలపు పంగి, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన బొద్దాన సామిత్, జరజాం గ్రామానికి చెందిన ముద్దాడ వెంకటేష్‌లు ఉన్నారు. వారి నుంచి రూ. 2 లక్షల విలువైన 10 కిలోల 825 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్‌లను రాజాం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారందించిన సమాచారంతో రాజాం పట్టణానికి చెందిన కసిన శ్రీధర్ (ఎ4), చిప్పాడ అరుణ్‌కుమార్ (ఎ5), జక్కం దీపక్ (6), రేగిడి ఆముదాల వలసకు చెందిన దంగల మణికంఠతో పాటు వారికి సహకరిస్తున్న మరో జువైనల్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు సలపు పంగి (ఎ1), బొద్దాన సామిత్ (ఎ2), జరజాం గ్రామానికి చెందిన ముద్దాడ వెంకటేష్ (ఎ3)లు ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న పొట్లాలుగా చేసి గంజాయి అలవాటు ఉన్న వారికి విక్రయిస్తుంటారు. అదేవిధంగా మిగతా నిందితులతో పాటు జువైనల్‌కు గంజాయి పీల్చే అలవాటుగా ఉన్నట్లు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీమ్

గంజాయి కలిగి ఉన్నా, వినియోగించినా, రవాణాకు పాల్పడినా చట్టపరమైన చర్యలుతప్పవని, వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. గంజాయి నియంత్రణలో భాగంగా ఇప్పటికే ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటుచేశామని, ఈ టీమ్ గంజాయి అక్రమ రవాణా, విక్రయించే వారి, వినియోగించే వారి సమాచారాన్ని సేకరించి, వారిని అదుపులోకి తీసుకుని, సంబంధిత పోలీసులకు అప్పగిస్తారని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో ప్రవేశించేందుకు ఆస్కారం ఉన్న 15 ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో ఆకస్మికంగా డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించేందుకు త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.

గంజాయి కేసులో ఇద్దరు మహిళలు..

భామిని: మండలంలోని బత్తిలి అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న కేసులో పాలకొండ సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్సై సీహెచ్.ప్రసాద్‌లు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న 11 కేజీల గంజాయిని సీజ్ చేసి, గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒడిశా మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. గంజాయి కేసులో అరెస్టు చేసిన ఇద్దరు మహిళలు ఒడిశాలోని పద్మాపూర్ సమితి, కెందుగూడకు చెందిన వారుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రైవేట్ బస్సు ద్వారా గంజాయి రవాణాకు మూలకారకులైన వారి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలు ఒడిశా అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలుగా తెలుస్తోంది.

సెంటర్ లైటింగ్‌ను ఢీకొట్టి యువకుడి దుర్మరణం


మృతుడు సాయి గణేష్ (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: విశాఖ జిల్లా భీమిలి ప్రభుత్వాస్పత్రి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్ల మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తంగుడుబిల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ వాల్లే నాగేశ్వరరావు, కొన్నేళ్లుగా నెల్లిమర్ల పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఆయన పెద్ద కుమారుడు సాయిగణేష్(22) చింతలవలస ఎంవీజీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు వెళ్లిన సాయి గణేష్, మరో స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై భీమిలి బీచ్ కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భీమిలి ప్రభుత్వాస్పత్రి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇనుప చువ్వ తలకు గుచ్చుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న మరో యువకుడికి గాయాలయ్యాయి. సాయిగణేష్ మృతితో తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు. మృతుడి స్వగ్రామం తంగుడుబిల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఓవీ పేట వీఆర్వోపై దాడి


శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతున్న వీఆర్వో వ్యాపార లక్ష్మీనారాయణ

బూర్జ: స్థానిక వీఆర్‌ఓ వ్యాపార లక్ష్మీనారాయణపై పలువురు రైతులు మంగళవారం దాడికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీనారాయణకు బూర్జ గ్రామంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పిల్లా వెంకటరావు, ముద్దాడ లక్ష్మణరావు (చింతయ్య)లు లక్ష్మీనారాయణ భూముల పక్కన కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. గత ఏడాది వీరి మధ్య సాగునీటి విషయమై గొడవ జరిగింది. ఈ ఏడాది కూడా ఆ గొడవలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం లక్ష్మీనారాయణ తన విధుల్లో భాగంగా ఓవీ పేట వెళ్తుండగా ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రధాన రహదారిపై మిగిలిన వారు దారికాచి దాడికి పాల్పడ్డారు. ముక్కు, తలపైన గాయం కావడంతో వీఆర్వో అక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి 108 సాయంతో ఆయనను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్‌పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు బూర్జ పోలీసు స్టేషన్ హెచ్‌సీ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వోను కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌర వాధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి, సామాజిక కార్యకర్త బీవీఎస్ఎన్ రాజు, ఓవీ పేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటు పొన్నాడ త్రినాథరావు తదితరులు పరామర్శించారు.

పుట్టగొడుగుల కూర తిని నలుగురికి అస్వస్థత

వజ్రపుకొత్తూరు రూరల్: పుట్ట గొడుగుల కూర తిని ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో గల సీతాపురంలో చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామ పరిసర కొబ్బరి తోటలో పుట్టగొడుగులు పుట్టుకు వచ్చాయి. కోటి భాస్కరరావు అనే వ్యక్తి పుట్ట గొడుగులను సేకరించి ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటిలో కూర చేసుకుని తిన్న కొద్ది సేపటికి బాధితులు కోటి జయమ్మ, కోటి వాసూక్షి, కోటి పద్మ, యోగిలకు వాంతులు, విరేచనాలు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

‘అసమానతలు లేని సమాజం రావాలి’


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పలాస: అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేసి అసువులు బాసిన అమర వీరుల బాటలో ప్రతి ఒక్కరు నడవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. పలాస సూదికొండలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన డాక్టరు మల్లికార్జున్, దుమ్ము అప్పలస్వామి, ఉర్లాం మల్లేశ్వరరావుల 52వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం, పీడిత తాడిత ప్రజల ప్రయోజనాల కోసం పోరాడిన ఈ అమర వీరులను మందస మండలం రామరాయి కొండల్లో పట్టుకొని పోలీసులు అతి కిరాతకంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లికార్జున రావు తన వైద్య వృత్తిని వదులుకుని శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అమర వీరుల ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, జుత్తు కృష్ణారావు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఒడియా పుస్తకాలు


ఒడిశాలో పుస్తకాలు తీసుకువస్తున్న అపోటా సంఘం నేతలు

కవిటి: జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థులకు రూ. 2లక్షల విలువ చేసే 9,10 వ తరగతులకు సంబంధించి ప్రథమ భాష(ఒడియా) పుస్తకాలు జిల్లాకు చేరాయి. మంగళవారం ఈ మేరకు ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ప్రతినిధులు తెలిపారు. ఒడియా సాహిత్య సింధు 1270 పుస్తకాలు సాహిత్య ధారా 1250 పుస్తకాలు, ఒడియా వ్యాకరణం 2520 పుస్తకాలు ఉన్నాయి. వీటిని ఒడిశా ప్రాంతీయ మాధ్యమిక బోర్డు బరంపురం జోన్ అసిస్టెంట్ సెక్రటరీ సనాతన బిసోయ్, శ్రీకాకుళం జిల్లా ఒడియా డీఐ దుర్గా ప్రసాద్ చౌధురీకి బరంపురం ప్రాంతీయ మాధ్యమిక బోర్డు కార్యాలయంలో అందజేశారు. వాటిని శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ఒడియా మీడియం ఉన్న పాఠశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గాయానికి ఒక రేటు..!


రోగులకు కట్టులు కట్టి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్న వార్డు ఇదే

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. గాయపడిన వారు ఎవరైనా ఆస్పత్రిలో చేరితే వైద్యుడు పరీక్షించిన అనంతరం ఆ గాయానికి కట్టు కట్టాలంటే వారు కట్టే కట్టుని బట్టి అక్కడ ఒక రేటు నిర్ణయిస్తున్నారు. ముఖ్యంగా డ్రస్సింగ్ రూంలో ఉన్న కొంత మంది సిబ్బంది గాయాలకు గురైన వ్యక్తిని రూంలోకి తీసుకువెళ్లి వారికి అయిన గాయానికి కట్టుకట్టి చిన్నకట్టుకి రూ.100 నుంచి పెద్ద కట్టుకి రూ.300వరకు వసూలు చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వక పోతే వారితో గొడవ పడి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారని రోగులతో పాటు ఆస్పత్రి సిబ్బంది సైతం చెబుతుండటం గమనించదగ్గ విషయం. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఎలాంటి లంచాలు లేకుండా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి చోరీ


కిట్టాలపాడులో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: కిట్టాలపాడు పొలాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లో విలువైన లోహాన్ని తొలగించి పట్టుకుపోయారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎత్తిపోతల పథకం వద్దకు రైతులు లేని సమయంలో వచ్చిన దొంగలు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అందులో ఉన్న (కోర్)రాగి లోహంతో పాటు ఆయిల్‌ను పట్టుకుపోయారు. దీంతో రైతులు వెంటనే విద్యుత్ శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణస్వామి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు రైతులు వినతిపత్రం అందించారు. ఎత్తిపోతల పథకానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎత్తిపోతల పథకం సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లేక, సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

‘సోషల్ మీడియాతో జాగ్రత్త’


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: నమ్మకం ఉన్న చోటే మోసం జరుగుతుందని, ఎవరినైతే నమ్ముతామో వారే మోసం చేస్తారని, అపరిచితులకు, చెడు ప్రభావాలకు ముఖ్యంగా బాలికలు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు విద్యార్థినులకు సూచించారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థల ఆదేశానుసారం జిల్లాలో చేపడుతున్న న్యాయ విజ్ఞాన సదస్సుల్లో భాగంగా మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులపై సోషల్‌మీడియా విపరీతంగా ప్రభావం చూపిస్తోందన్నారు. సోషల్ మీడియా చెడు ప్రభావాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాలో మహిళలే ఎక్కువగా బాధితులుగా ఉన్నారని తెలిపారు. ఆడపిల్లలను వ్యభిచార గృహాలకి విక్రయించేస్తున్నారని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి మాట్లాడుతు తమ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటుచేసి, బాలికలను చైతన్యపరిచిన న్యాయసేవాధికారి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ గేదెల ఇందిరాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..


స్థానిక కేవీఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1970 నుంచి 1975 వరకు చదివిన వారు మంగళవారం మళ్లీ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు కె.గాలి మోహనరావు, యు.పోలినాయుడు, ఇ.బుచ్చిబాబు, టి.సోంబాబు, కె.లక్ష్మణమూర్తి, వై.గురన్న, వి.కుమారస్వామి, ఎస్.మధుసూదనరావు, పి.తులసిరావులను సత్కరించారు.

– జలుమూరు

ప్రాసెసింగ్ సెంటర్ల పరిశీలన



జీడి ప్రాసెసింగ్‌లో పీఓ రాహుల్ కుమార్ రెడ్డి

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామం సమీపంలోని ఆర్టిక్ ఎస్‌జీఓ భవనాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పసుపు, కొండ చీపుర్ల ప్రాసెసింగ్ సెంటర్లను సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రాసెసింగ్ సెంటర్‌కు కొనుగోలు చేసిన పసుపు, కొండచీపుర్లు, జీడి పిక్కల నిల్వల గురించి ఆరా తీశారు. సెంటర్ నిర్వహణపై ఏపీఎం జనార్ధన నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు సెంటర్లకు సరుకులు విక్రయించిన రైతులతో పీఓ మాట్లాడారు. ప్రస్తుతం రూ.30 వేలు లాభాలతో నడుస్తున్నట్లు ఏపీఎం పీఓకు చెప్పారు. కార్యక్రమంలో ఐబీ ఏపీఎం త్రినాథమ్మ, సీసీలు అరుణ జ్యోతి, చంద్రరావు, కనకలక్ష్మి, ప్రమీల, వీఓ మణికుమారి, గౌరీకళ, సంధ్యారాణి ఉన్నారు

మూడు రోజుల్లో 24 కేసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో మైనర్ల ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా 24 మంది మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఒక్కొక్కరికీ రూ. 1500 చొప్పున మొత్తం రూ. 36 వేలు ఫైన్ వేశారు. వారి తల్లిదండ్రులను మంగళవారం రాత్రి ట్రాఫిక్ సీఐ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేశారు.

పదోన్నతి ఉత్తర్వుల అందజేత


పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జెడ్పీ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు రికార్డు సహాయకులకు జూనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఉత్తర్వులు జారీ చేసి ని యామక పత్రాలు అందజేశారు. కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తు న్న ఓ.కృష్ణవేణిని చిన్నబాడాం జిల్లా పరిషత్ ఉన్నత పా ఠశాల జూనియర్ సహాయకులుగా వేశారు. జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈపీ కృష్ణారావును కొత్తపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకులుగా బది లీ చేశారు. అలాగే పైడి భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నైట్‌వాచర్ కె.సూర్యకుమారిని కోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆఫీస్ సబార్డినేట్‌గా, సంతవురిటిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నైట్ వాచర్‌గా పనిచేస్తున్న బి.రమణను ఎచ్చెర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ నియామక పత్రాలను ఇరువురికీ అందజేశారు.

చాకిపల్లిలో అలజడి

టెక్కలి: టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అలజడి చోటు చేసుకుంది. సర్పంచ్ వాన తవిటయ్య, ఆయన సోదరుడు వాన నారాయణ ఎంపీటీసీ భర్త పొందర శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పంగ చంద్రమౌళితో పాటు మరికొంత మందిపై గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ రాత్రి సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ వెంకటేశ్వరరావుతో పాటు పోలీస్ సిబ్బంది రాత్రి సమయంలో చాకిపల్లి గ్రామానికి చేరుకుని అక్కడ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు చేశారు. పోలీసులు కొంత సమయం గ్రామంలో పర్యవేక్షణ చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాశారు. గ్రామంలో ఏం జరిగిందనే విషయమై దర్యాప్తు చేపట్టారు.

కూటమి ప్రభుత్వం మాట మార్చుతోంది

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం /రూరల్: కూటమి ప్రభుత్వం హామీలపై మాట మార్చుతోందని, ప్రశ్నించే వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు దుయ్యబట్టారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగాలేనందున సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచడంలో తాను ముందుకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నానంటూ సీఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు సందేశం పంపించడం సిగ్గుచేటని అన్నారు. 2019లో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు ఉన్నప్పటికీ రాష్ట్ర సంక్షేమం, పథకాలు అమలులో రాజీ పడకుండా కరోనా కష్ట కాలంలో సైతం ఏ ఒక్క పథకం కూడా ఆపకుండా అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, అతని మీడియా ఈ రాష్ట్రానికి అప్పులు రూ.14లక్షల కోట్లు అంటూ ఊదరగొట్టాయని, తీరా సీఎంగా సీట్లో కూర్చుని లెక్కలు చూసే సరికి ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా ఆ నంబర్ కనిపించలేదని, చివరికి గవర్నర్ ప్రసంగం వచ్చే సరికి రూ.10లక్షల కోట్లకు తగ్గించి సాక్షాత్ రాష్ట్ర గవర్నర్ చేత కూడా అబద్ధాలు చెప్పించారని దుయ్యబట్టారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని వారిని రోడ్డున పడేశారని, రైతు భరోసా, మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి, అమ్మకు వందనం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ సూపర్ సిక్స్ పేరిట కూటమి నేతలు ప్రజల్లోకి వెళ్లారని, ప్రజలు ఆకర్షితులై కూటమి ప్రభుత్వానికి పట్టం కడితే ఇలా దగా చేయడం సరికాదని అన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన ప్రతి పథకాన్ని అమలు చేయాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్లు బచ్చు జగన్, సుగ్గు ప్రేమ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, ఆశి పురుషోత్తమరెడ్డి, లాభాల శంకరరావు, ఆశి కృష్ణారెడ్డి, కిరణ్, పిలక మోహన రావులు పాల్గొన్నారు.

వాహనాల రిలీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ సమీపంలోని చిలకపాలెం పంచాయతీ నారాయణపురం పరిధిలో అక్రమ క్వారీయింగ్, గ్రావెల్ తరలింపుపై ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు క్వారీ జరుగుతున్న స్థలం పరిశీలించి ఆరు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ స్వాధీనం చేసుకొని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేయడంతో రూ.3400 అపరాధ రుసుం వసూలు చేసి రిలీజ్ ఆర్డర్ ఇచ్చి వాహనాలు విడిచిపెట్టేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ రెవెన్యూ, మైన్స్ అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.